సాక్షి అనంతపురం

ఆదివారం । 10 । నవంబర్ । 2024



చీనీ టన్ను రూ.30 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.30 వేలు పలికాయి.



టమాట కిలో రూ.23

అనంతపురం కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.23 పలికింది. కనిష్టం రూ.10, సరాసరి రూ.16 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
34.9°/ 18.6°

జిల్లా అంతటా శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. తూర్పు దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

రీసెర్చ్ ప్రాజెక్ట్‌లకు సహకారం



సతీష్ రెడ్డిని సన్మానిస్తున్న ఇన్‌చార్జ్ వీసీ సుదర్శనరావు

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ)కు రీసెర్చ్ ప్రాజెక్టులు అందేలా సహకారం అందిస్తామని డీఆర్‌డీఓ మాజీ చైర్మన్, కేంద్ర రక్షణ మంత్రి మాజీ సలహాదారు డాక్టర్ జి. సతీష్ రెడ్డి అన్నారు. జేఎన్‌టీయూ (ఏ) ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ విభాగం పూర్వ విద్యార్థి అయిన సతీష్ రెడ్డి శనివారం వర్సిటీని సందర్శించారు. కాన్ఫరెన్స్ హాలులో ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలకు ఎల్లప్పుడూ సహకారం అందిస్తానన్నారు. లేజర్స్, ఇమేజ్ ప్రాసెసింగ్, సైబర్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి అంశాలపై గెస్ట్ లెక్చర్, ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తానన్నారు. డీఆర్‌డీఓ నుంచి పూర్తి సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ వీసీ సుదర్శనరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.కృష్ణయ్య, ఓఎస్డీటూ వీసీ ప్రొఫెసర్ ఓ దేవన్న, ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, పూర్వ విద్యార్థుల సంఘం డైరెక్టర్ ప్రొఫెసర్ పి. సుజాత, ప్రొఫెసర్ కేపీ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీఈఓల డిప్యుటేషన్లు రద్దు

అనంతపురం అగ్రికల్చర్: మల్టీ పర్పస్ ఎక్స్‌టెన్షన్ అసిస్టెంట్స్ (ఎంపీఈఓ) డిప్యుటేషన్లను రద్దు చేస్తూ వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల నుంచి చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాలకు వెళ్లిన 106 మంది ఎంపీఈఓలకు వెసులుబాటు కల్పించారు. ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్ల రేషనలైజేషన్ ప్రక్రియ కొనసాగుతున్న తరుణంలో డిప్యుటేషన్లను రద్దు చేశారు. వారందరినీ రిలీవ్ చేయాలంటూ చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల జేడీఏలను ఆదేశించారు. అలాగే వారికి అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల పరిధిలో సర్దుబాటు చర్యలు చేపట్టాలని రెండు జిల్లాల జేడీఏలకు ఉత్తర్వులు జారీ చేశారు.

రాయితీతో సోలార్ రూఫ్‌టాప్



సోలార్ ప్యానెళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్

అనంపతపురం అర్బన్: ''ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్ బిజ్లి పథకాన్ని సద్వినియోగం చేసుకుని ప్రతి ఒక్కరూ ఇళ్లపై సోలార్ రూఫ్‌టాప్ నిర్మించుకోవాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక జేఎన్‌టీయూ రోడ్డులోని ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్‌ఈ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన సూర్యఘర్ మేళా కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వాతావరణం సోలార్ విద్యుత్‌కు ఎంతో అనుకూలమన్నారు. ఇంటికి కావాల్సిన విద్యుత్‌ని వాడుకోవడంతో పాటు మిగిలిన విద్యుత్‌ని సంస్థ కొనుగోలు చేసి డబ్బును జమ చేస్తుందన్నారు. జిల్లాకు పవర్ గ్రిడ్, సోలార్ పార్క్ రాబోతున్నాయన్నారు. అనంతరం పోస్టర్లను విడుదల చేశారు. కలెక్టర్‌ను విద్యుత్‌శాఖ అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్‌ఈ సంపత్‌కుమార్, ట్రాన్స్‌కో ఎస్‌ఈ వరప్రసాద్, ఈఈలు జేవీరమేష్, రాజశేఖర్, శేషాద్రిశేఖర్, ప్రసాద్, బ్యాంకర్లు పాల్గొన్నారు.

కక్షగట్టి.. బాధల్లోకి నెట్టి

- కూటమి ప్రభుత్వంలో 108పై అంతులేని నిర్లక్ష్యం
- నిర్వహణ ఖర్చులు చెల్లించని వైనం
- బాధితులు ఫోన్ చేస్తే స్పందన శూన్యం
- ఆటోలు, ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్న రోగులు
- మరోవైపు జీతాలందక 108 డ్రైవర్ల నరకయాతన



ఇది పెద్దవడుగూరు మండలానికి కేటాయించిన 108 వాహనం. కొన్ని నెలలుగా ఈ వాహనం అనంతపురం సర్వజనాస్పత్రిలో వెనుక వైపు ఉండిపోయింది. పెద్ద వడుగూరు ప్రాంతానికి చెందిన వారు 108కు ఫోన్ చేస్తే ఎటువంటి స్పందన ఉండటం లేదు. దీంతో రోగులు గత్యంతరం లేక ప్రైవేట్ వాహనాల్లో వెళ్తున్నారు.

అనంతపురం మెడికల్/గార్లదిన్నె: కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తోంది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని సకాలంలో ఆస్పత్రులకు తీసుకువచ్చే అపర సంజీవనిపై శీతకన్ను వేస్తోంది. 108ల నిర్వహణ బాధ్యతలను కొత్త కాంట్రాక్టర్‌కు అప్పగించాలన్న ధోరణితో నిర్లక్ష్యం చేస్తోంది. దీంతో రోగులు, క్షతగాత్రులు, ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారు నరకం చూస్తున్నారు. వ్యయ ప్రయాసాలతో ఆస్పత్రులకు వస్తున్నారు.

ఐదు మినహా అన్నీ కొత్తవే..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులను తీసుకువచ్చారు. రోగులను అత్యవసర సమయాల్లో ఆస్పత్రులకు తరలించే 108 వ్యవస్థను మరింత బలోపేతం చేశారు. జిల్లాలో ప్రతి మండలానికి ఒక వాహనం ఉండేలా చర్యలు తీసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వందల సంఖ్యలో అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్, బేసిక్ లైఫ్ సపోర్ట్, నియోనెటాల్ వాహనాలు అందుబాటులోకి తీసుకొచ్చారు. జిల్లాలో ప్రస్తుతం ఉన్న 35 వాహనాల్లో ఐదు మినహా అన్ని కొత్తవే కావడం గమనార్హం. దీంతో రోగులు, బాలింతలు, గర్భిణులు, రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని క్షణాల్లో ఆస్పత్రికి తీసుకువచ్చేవారు. కనీసం ఒక్కో వాహనం రోజుకు నాలుగు నుంచి ఐదుగురిని ఆస్పత్రులకు తరలించేది.

పట్టించుకోని కూటమి ప్రభుత్వం..

కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ పరిస్థితి పూర్తిగా కనుమరుగైపోయింది. 108కు ఫోన్ చేస్తే కాసేపు ఉండండి అంటూ కాల్ సెంటర్ నుంచి సమాధానం వస్తోంది. చాలా వాహనాలు మరమ్మతులకు గురై షెడ్డుకే పరిమితమవుతున్నాయి. మంత్రి పయ్యావుల కేశవ్ ప్రాతినిథ్యం వహిస్తున్న ఉరవకొండ నియోజకవర్గంలోని వజ్రకరూరు, విడపనకల్లు మండలాలకు కేటాయించిన వాహనాలు డీజిల్ లేక నిలిచిపోయాయి. గుత్తి, పెద్దవడుగూరు, యాడికి, గార్లదిన్నె మండలాలకు కేటాయించిన 108 వాహనాలకు టైర్లు లేక ముక్కుతూ, మూలుగుతూ సాగుతున్నాయి. పెద్దవడుగూరు వాహనం గత నెల 27 నుంచి మరమ్మతులకు నోచుకోలేదు. గత 20 రోజుల నుంచి యాడికి మండలం 108 వాహనం మరమ్మతులకు గురై తిరగడం లేదు. పెద్దపప్పూరు మండలంలో సిబ్బంది కొరతతో సకాలంలో వైద్య సేవలు అందించడం లేదు.

జిల్లాలో 108 వాహనాలు	35
అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్ వాహనాలు	05
బేసిక్ లైఫ్ సపోర్ట్ వాహనాలు	27
బ్యాక్ అప్ వాహనాలు	02
నియోనెటాల్ వాహనం	01

దాదాపు అన్ని చోట్ల ప్రస్తుతం ఇదే దుస్థితి. ఈ క్రమంలో అత్యవసర సమయాల్లో రోగుల కుటుంబీకులు 108కు ఫోన్ చేస్తే స్పందన ఉండటం లేదు. దీంతో వారు సొంతంగా వాహనాలను బాడుగకు తీసుకుని ఆస్పత్రులకు తీసుకొస్తున్నారు. పేదలపై భారం మోపడం న్యాయమా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

మేనేజర్ పోస్టు ఖాళీ..

గతంలో 108 నిర్వహణకు సంబంధించి మేనేజర్ ఉండేవారు. అలాంటి మేనేజర్ పోస్టు కొన్ని నెలలుగా ఖాళీగా ఉంది. ప్రజల ప్రాణాలతో ముడిపడి ఉన్న 108 వ్యవస్థ పట్ల ప్రభుత్వం ఏ పాటి చిత్తశుద్ధి చూపిస్తోందో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం

108 నిర్వహణ మా పరిధిలో లేదు. ఈ విషయాన్ని కలెక్టర్‌కు విన్నవించాం. సదరు ఏజెన్సీతో ప్రభుత్వం చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. 108 వాహనాలు సకాలంలో ఆస్పత్రులకు రోగులను తీసుకువచ్చేలా సంబంధిత సిబ్బందికి సూచిస్తున్నాం. రోగులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషి చేస్తాం.

– డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి, డీఎంహెచ్ఓ



- ఈ ఫొటోలో కన్పిస్తున్న వ్యక్తి పామిడి మండలం కాలాపురం గ్రామానికి చెందిన మధు. ఈ నెల 8న అతను ఆత్మహత్యకు యత్నించాడు. ఈ క్రమంలోనే గుర్తించిన కుటుంబీకులు మధును అనంతపురం ఆస్పత్రికి తరలించేందుకు ఆరోజు ఉదయం 10 గంటల సమయంలో 108కు ఫోన్ చేయగా స్పందన కరువైంది. దిక్కుతోచని బాధితులు రూ. 3 వేలు ఖర్చు చేసుకుని ఓ ప్రైవేట్ వాహనంలో సర్వజనాస్పత్రికి మధును తీసుకొచ్చారు. రోజూ కూలికెళితేనే తమకు జీవనం జరుగుతుందని, అయినా రూ.వేలల్లో ఖర్చు చేయాల్సి వచ్చిందని మధు భార్య ఆవేదన వ్యక్తం చేశారు.

సిబ్బంది జీవితాలతోనూ ఆటలు

జీతాలు చెల్లించకుండా 108 ఉద్యోగులతోనూ ప్రభుత్వం ఆటలాడుతోంది. మూడు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ కోసం అప్పులు చేయాల్సి వస్తోందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు సిబ్బంది కొరతతో సెలవులు కూడా మంజూరు చేయకపోవడంతో శారీరకంగా, మానసికంగానూ ఇబ్బందులు పడుతున్నారు. శింగనమల, తాడిపత్రి, గుంతకల్లు నియోజకవర్గాల్లో బకాయిలు రూ.46.80 లక్షలు మేర పేరుకుపోయాయి. మిగిలిన అన్ని మండలాల్లోనూ ఇదే దుస్థితి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జీతాలు చెల్లించాలని చిరుద్యోగులు వేడుకుంటున్నారు.

ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కేసులా?

- గతంలో ఎన్నడూ లేని రీతిలో ప్రతిపక్ష పార్టీ కార్యకర్తలపై వేధింపులు
- మాజీ సీఎం జగన్, కుటుంబ సభ్యులను కించపరిచినా పట్టించుకోరా?
- 'ఐటీడీపీ' పేరుతో అధికారికంగా పోస్టులు పెడుతున్న వారిపై చర్యలేవీ?
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామి రెడ్డి ధ్వజం



డీఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి, పార్టీ నేతలు

అనంతపురం: 'ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అక్రమ కేసులు నమోదు చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై కేసులు పెట్టి వేధిస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే తీవ్ర పరిణామాలు ఉంటాయి' అని పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామి రెడ్డి హెచ్చరించారు. టీడీపీ అధికారిక ఖాతాలు, ఆ పార్టీ కార్యకర్తలు సామాజిక మాధ్యమాల్లో ఇష్టారీతిన పెడుతున్న పోస్టులపై చర్యలు తీసుకోరా అని ప్రశ్నించారు. శనివారం అనంతపురం డీఎస్పీ శ్రీనివాసరావును పార్టీ శ్రేణులతో కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఎంతో మంది ముఖ్యమంత్రులు అయ్యారని, గతంలో ఎన్నడూ లేని రీతిలో రాష్ట్రంలో నేడు రాజకీయ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. శాంతిభద్రతలను పరిరక్షించాల్సింది పోయి వైఎస్సార్ సీపీని టార్గెట్ చేస్తున్నారన్నారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పాలనలో వైఫల్యం చెందిందని, వాటిని కప్పిపుచ్చుకునేందుకు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు. ఇటీవల పిఠాపురంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హోం మంత్రినే కాకుండా పరోక్షంగా చంద్రబాబు పనితీరునూ విమర్శించారన్నారు.అప్పటి నుంచి పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తలను అరెస్ట్ చేయడం ప్రారంభించారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలపై చేతులెత్తేశారని, ఈ క్రమంలో ఆ హామీల వీడియో క్లిప్పింగ్‌లను పెడుతుంటే జీర్ణించుకోలేక గొంతు నొక్కడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. టీడీపీ అధికారిక సోషల్ మీడియా అకౌంట్లలో అసభ్యకరంగా పోస్టులు పెడుతున్నారని, వైఎస్ జగన్, ఆయన సతీమణి, తల్లి, మాజీ మంత్రులు, మహిళా నేతలను జుగుప్సాకరంగా చిత్రీకరించి పోస్టులు పెడుతున్న వాళ్లను ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఐదు నెలలుగా మహిళలు, చిన్నారులపై యథేచ్ఛగా దాడులు, అత్యాచారాలు జరుగుతున్నాయన్నారు. వాటిని కట్టడి చేయడం చేతగాక వైఎస్సార్ సీపీని టార్గెట్ చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వ దాష్టీకాలపై ప్రజాస్వామ్యబద్ధంగా ఎంతవరకైనా వెళ్తామని స్పష్టం చేశారు.

స్వేచ్ఛను హరించేలా పాలన..

రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛను హరించేలా చంద్రబాబు పాలన కొనసాగుతోందని జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ మండిపడ్డారు. హామీలను అమలు చేయాలని కోరితే అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. లా అండ్ ఆర్డర్ గాడి తప్పిందని ఉప ముఖ్యమంత్రి చెప్పారంటే రాష్ట్రంలో ఎలాంటి పాలన సాగుతోందో అర్థం చేసుకోవచ్చన్నారు. అనంతపురం నగర పాలక మేయర్ వసీం సలీం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి కక్షసాధింపులకు పాల్పడుతున్నారన్నారు. ఏ కేసులోనైనా అరెస్ట్ చేస్తే 24 గంటల్లో కోర్టు ముందు హాజరుపరచాల్సి ఉంటుందని, కానీ అవేవీ పట్టించుకోకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ వేదాంతం నాగరత్నమ్మ, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్లు ఫయాజ్, నార్పల సత్యనారాయణ రెడ్డి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు చింతా సోమశేఖర్ రెడ్డి, జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ వెన్నం శివా రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాస రెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లా భేగ్, కార్పొరేటర్లు ఇసాక్, రహంతుల్లా, కమలభూషణ్, నాయకులు రాధాకృష్ణ, అమర్‌నాథ్ రెడ్డి, శ్రీనివాసులు, శివా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగిని దారుణహత్య!

- గోప్యంగా ఉంచిన పోలీసులు
- పోలీసుల అదుపులో నిందితులు?



రామమునినమ్మ (ఫైల్)

రాప్తాడురూరల్: జిల్లా పశుసంవర్ధకశాఖలో అటెండర్‌గా పని చేస్తూ అదృశ్యమైన రామ మునినమ్మ దారుణహత్యకు గురైంది! అయితే పోలీసులు ఈ విషయాన్ని గోప్యంగా ఉంచారు. అనంతపురం నగర శివారులోని బళ్లారి రోడ్డు ఎంవైఆర్ ఫంక్షన్ హాలు ఎదురుగా ఓ కాలనీలో నివాసం ఉంటున్న రామ మునినమ్మ గత నెల 17న అదృశ్యమైంది. ఇంట్లో వస్తువులన్నీ చిందరవందరగా పడేసి, సీసీ కెమెరా ఫుటేజీలను సైతం తొలగించి హార్డ్‌డిస్క్ మాయం చేయడంపై అప్పట్లోనే అనుమానాలు తలెత్తాయి. బాధితురాలి కుటుంబ సభ్యులు ఎస్పీని ఆశ్రయించారు. ఎస్పీ ఆదేశాలతో గత నెల 28న అనంతపురం రూరల్ పోలీసుస్టేషన్‌లో రామమునినమ్మ అదృశ్యంపై కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి వివిధ కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తూ వచ్చారు. ఎలాంటి ఆధారాలూ లభించలేదు. చివరకు ఆమె నివాస పరిసర ప్రాంతంలోనే హత్యకు గురైనట్లు శనివారం గుర్తించారు. అయితే ఈ విషయాన్ని పోలీసులు గోప్యంగా ఉంచారు. హత్య ఘటనలో ముగ్గురు వ్యక్తులు పాల్గొన్నట్లు తెలిసింది. ప్రస్తుతం నిందితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. ప్రభుత్వ ఉద్యోగిని హత్య ఘటన వెలుగులోకి వస్తే ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని భావించి పోలీసు అధికారులు గోప్యంగా ఉంచినట్లు తెలుస్తోంది. ఘటనాస్థలం నుంచి మృతదేహం తరలింపునకు ఇబ్బందిగా మారడంతో అక్కడే పోస్టుమార్టం నిర్వహించేలా ఆలోచిస్తున్నట్లు సమాచారం.

తమ్ముళ్ల నడుమ పేకాట చిచ్చు

తాడిపత్రిటౌన్: తాడిపత్రిలో తమ్ముళ్ల నడుమ పేకాట చిచ్చు రేపింది. పేకాట స్థావరం నిర్వహించినందుకు వసూలు చేసిన డబ్బు పంపకాల విషయంలో వివాదం తలెత్తింది. వర్గాలుగా ఏర్పడి కొట్టుకునే వరకూ వెళ్లారు. వివరాలు.. తాడిపత్రిలోని పాత కూరగాయల మార్కెట్ సమీపంలో ఓ టీడీపీ నేత పేకాట స్థావరం నిర్వహిస్తున్నాడు. సుంకులమ్మపాలెంకు చెందిన సురేష్, రెడ్డివారిపాలెంకు చెందిన విశ్వనాథ్ అనే టీడీపీ కార్యకర్తలు పేకాటరాయుళ్లను పోగు చేసి ఇక్కడికి తీసుకొచ్చేవారు. పేకాట స్థావరం నిర్వహణ ద్వారా వచ్చిన ఆదాయం పంచుకోవడంలో శుక్రవారం వీరిద్దరి మధ్య వివాదం చెలరేగింది. ఈ క్రమంలోనే తమ కాలనీలకు చెందిన యువకులను పెద్ద సంఖ్యలో పోగు చేసుకొని ఒకరిపై ఒకరు దాడులకు సిద్ధమయ్యారు. అయితే, ముందస్తు సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకోవడంతో అందరూ పారిపోయేందుకు యత్నించారు. పోలీసులు విశ్వనాథ్‌ను పట్టుకుని స్థానిక స్టేషన్‌కు తీసుకొచ్చారు. విషయం బయటకు పొక్కకుండా గుట్టుగా విచారణ చేస్తున్నారు. దీనిపై సీఐ సాయిప్రసాద్‌ను వివరణ కోరగా.. బార్‌లో బిల్లు కట్టే విషయంలో సురేష్, విశ్వనాథ్ మధ్య గొడవ చెలరేగినట్లు తెలిపారు. దీంతో రెండు రోజులుగా ఆయా కాలనీల్లో గస్తీ నిర్వహిస్తున్నామన్నారు. ఈ క్రమంలో ఇద్దరూ తమ అనుచరులను కూడగట్టుకుని గొడవ పడేందుకు సిద్ధమవుతుండగా దాడులు నిర్వహించామన్నారు. సురేష్ ఇంటికి తాళం వేసి వెళ్లిపోయాడని, విశ్వనాథ్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సమస్య తెలియజేశాడన్నారు. అలాగే కూరగాయల మార్కెట్ సమీపంలో టీడీపీ నేత కూడా అందుబాటులో లేడని తెలిపారు. కాగా, సురేష్, విశ్వనాథ్ గతంలో పేకాట ఆడిస్తూ పోలీసులకు పట్టుబడినట్లు తెలిసింది.

రాష్ట్రస్థాయి అవార్డులకు ఆరుగురి ఎంపిక



ప్రొఫెసర్లు బి. దిలీప్ కుమార్, పి. చెన్నారెడ్డి, విశాల జి. గోర్పడే, ఎంవీ లక్ష్మయ్య టీచర్లు రమేష్‌బాబు, సుజాత

అనంతపురం/ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏటా ప్రకటించే రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డులకు ఈసారి జిల్లా నుంచి నలుగురు ప్రొఫెసర్లు, ఇద్దరు ఇంగ్లిష్ టీచర్లు ఎంపికయ్యారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య (ఫిజిక్స్), జేఎన్‌టీయూ (ఏ)లో సివిల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ విశాల గోర్పడే, కెమికల్ ఇంజినీరింగ్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ దిలీప్ కుమార్, కంప్యూటర్స్ సైన్సెస్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ పి. చెన్నారెడ్డి ఉత్తమ అధ్యాపకులుగా ఎంపికవగా, అనంతపురం నగరంలోని శ్రీపొట్టిశ్రీరాములు నగరపాలక ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ టీచరు పాలమాడ రమేష్‌బాబు, ఆత్మకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ టీచరు గండబత్తుల సుజాతను రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ అవార్డులకు ఎంపిక చేసింది. వీరికి ఈ నెల 11న విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు అవార్డులు అందజేస్తారు.

పరిశోధనల్లో దిట్ట దిలీప్‌కుమార్

డాక్టర్ బి. దిలీప్ కుమార్‌కు 18 సంవత్సరాల అధ్యాపక అనుభవం ఉంది.ఐఐటీ ఖరగ్‌పూర్‌లో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఫొటో ఎలక్ట్రో కెమికల్ వాటర్ స్ప్లిట్టింగ్ వయా మెటల్–ఆక్సైడ్ హెటిరో స్ట్రక్చర్స్ అనే అంశంపై విశేషమైన పరిశోధనలు చేశారు. 29 ఇంటర్నేషనల్ జర్నల్స్, 9 నేషనల్ జర్నల్స్‌ను ప్రచురించారు. 'క్లిక్ కెమిస్ట్రీ బేస్డ్ అప్రోచ్ టు ఇంప్రూవ్ ద ఫొటోస్టెబులిటీ ఆఫ్ డైస్ ఫర్ లాంగ్ టర్మ్ స్టెబులిటీ డై సెన్సైజెడ్ ఫొటో ఎలక్ట్రో కెమిక్ వాటర్ స్ప్లిట్టింగ్' అనే పరిశోధనపై పేటెంట్ సైతం దక్కింది.

విశేషానుభవం చెన్నారెడ్డి సొంతం

జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ పి. చెన్నారెడ్డికి కంప్యూటర్ సైన్సెస్ విభాగం అధ్యాపకుడిగా 28 సంవత్సరాల విశేష అనుభవం ఉంది. జేఎన్‌టీయూ హైదరాబాద్‌లో పీహెచ్‌డీ పూర్తి చేశారు. 114 జర్నల్స్‌ను ప్రచురించారు. ఒక పేటెంట్ సాధించారు. ఐదు పుస్తకాలు రచించారు.

వినూత్న పరిశోధనల విశాల..

జేఎన్‌టీయూ(ఏ) సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ విశాల జి. గోర్పడేకు 22 సంవత్సరాల బోధనానుభవం ఉంది. కాంక్రీట్ పగుళ్ల నివారణకు బ్యాక్టీరియాను ఉత్పత్తి చేసిన వినూత్న పరిశోధనకు పేటెంట్ దక్కించుకున్నారు.

జర్నల్స్ నిష్ణాతులు లక్ష్మయ్య

శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఫిజిక్స్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్యకు 25 సంవత్సరాల బోధన, పరిశోధనానుభవం ఉంది. అమెరికాలో రీసెర్చ్ ఫెలోగా పనిచేశారు. ఎస్కేయూ రిజిస్ట్రార్‌గా రెండు సంవత్సరాలు వ్యవహరించారు. 120 జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌ను ప్రచురించారు.

బోధనలో మేటి రమేష్ బాబు

సుదీర్ఘ బోధనానుభవం. ఆంగ్లభాషను సులువుగా బోధించేందుకు విభిన్న ఉపకరణాల వినియోగం. విద్యార్థులకు వేగంగా అర్థమయ్యేలా బోధన చేయడం రమేష్‌బాబు సొంతం. ఆంగ్ల భాష జిల్లాస్థాయి శిక్షకులుగా ఈయన పని చేశారు. ఎంఈఓ, డైట్ కళాశాల అధ్యాపకులు, హెచ్‌ఎంల శిక్షణ, సచివాలయ సిబ్బంది శిక్షణ, ఎన్నికల, జనాభాగణన శిక్షకులుగా పని చేశారు. ఎలాంటి క్లిష్ట అంశాన్నైనా సులువుగా అర్థమయ్యేలా బోధిస్తారు. డీసీఈబీ అనంతపురం వారు పదో తరగతి విద్యార్థుల కోసం రూపొందించే 'అనంత సంకల్పం' పుస్తకంలో ఆంగ్లభాష స్టడీ మెటీరియల్ తయారు చేశారు.

పిల్లలే సుజాత లోకం..

1997 జనవరి 10న టీచరుగా చేరారు. అప్పటి నుంచి ఇప్పటిదాకా విద్యార్థులే ఆమె లోకం. పిల్లలతో మమేకమై వారికి సులువుగా అర్థమయ్యేలా బోధించేందుకు తాపత్రయపడుతుంటారు. అనేక టీచింగ్ లర్నింగ్ మెటీరియల్స్ ఉపయోగిస్తూ బోధన సాగిస్తున్నారు. లాంగ్వేజ్ గేమ్స్ ద్వారా పిల్లల్లో ఆంగ్ల బోధనపట్ల మక్కువ పెంచేప్రయత్నం చేస్తున్నారు. ఎమ్మార్పీగా, కాంప్లెక్స్ రీసోర్స్ పర్సన్‌గా, డీఆర్పీగా, స్టేట్ రీసోర్స్‌పర్సన్‌గా పని చేశారు. అలాగే స్కూల్ కాంప్లెక్స్ మోడల్స్ రైటర్‌గా, యూపీ స్కూల్ లెవల్ టీచర్స్ మోడల్ రైటర్‌గా, కొత్త పాఠ్యపుస్తకాల రైటర్‌గా పని చేశారు.

క్లుప్తంగా

ముగిసిన అంతర్ కళాశాలల క్రీడా పోటీలు



విజేతలకు బహుమతులను అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు: పట్టణంలోని శ్రీ శంకరానంద గిరి స్వామి డిగ్రీ కళాశాలలో జరుగుతున్న శ్రీ కృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల పురుషుల క్రీడా పోటీలు శనివారం ముగిసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఖోఖోలో శ్రీ శంకరానందగిరిస్వామి డిగ్రీ కళాశాల (గుంతకలు), హ్యాండ్‌బాల్‌లో నారాయణ బీపెడ్ కళాశాల (తాడిపత్రి), ఫుట్‌బాల్‌లో మంగళకర కళాశాల (పుట్టపర్తి), రగ్బీ పోటీల్లో ఆర్ట్స్ కళాశాల (అనంతపురం) విజేతలుగా నిలిచాయని వివరించారు. విజేతలకు కళాశాల డైరెక్టర్ గోపాల్, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం స్పోర్ట్స్ సెక్రటరీ జెస్సీ, బహుతులను అందజేసి అభినందిచారు.

జిల్లాలో ఇద్దరికి నామినేటెడ్ పదవులు

అనంతపురం క్రైం: కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవుల రెండో జాబితాను శనివారం విడుదల చేసింది. ఇందులో జిల్లా నుంచి ఇద్దరిని నామినేటెడ్ పోస్టులు వరించాయి. అనంతపురం – హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అహుడా) చైర్మన్‌గా టి.సి. వరుణ్, ఆర్టీసీ కడప జోనల్ చైర్మన్‌గా పూల నాగరాజు నియమితులయ్యారు.

వృద్ధుడు ఆత్మహత్య



నరసింహులు మృతదేహం

అనంతపురం: నగరంలో ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం గుంతపల్లికి చెందిన నరసింహులు (65) శనివారం అనంతపురం అరవిందనగర్‌లోని మూడో క్రాస్‌లో ఊజీ మాత్రలు మింగాడు. అపస్మారస్థితిలో పడి ఉన్న నరసింహులును విద్యార్థులు గమనించి, జేబులో ఉన్న వివరాల ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం అతడిని విద్యార్థులే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో నరసింహులు మృతి చెందాడు. టూటౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్ కేసు నమోదు చేశారు. ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు.

క్వారీ.. అక్రమాల స్వారీ

- లీజు ఒక చోట.. తవ్వకాలు మరో చోట
- అనుమతులు లేకుండానే తవ్వకాలు
- పర్మిట్ లేకుండానే ఖనిజం అక్రమ రవాణా
- పట్టించుకోని గనుల శాఖ అధికారులు



● గ్రావెల్ తవ్వుతున్న ఈ దృశ్యం అనంతపురం రూరల్ మండలం నరసనాయనికుంట గ్రామ సమీపంలోనిది. ఈ ప్రాంతంలో ఒక మహిళ పేరిట మూడు హెక్టార్లలో గ్రావెల్ తవ్వకానికి లీజు తీసుకున్నారు. అయితే లీజు తీసుకున్న ప్రాంతం కాకుండా పక్కనే ఉన్న గుట్టలో అక్రమంగా తవ్వకాలు చేస్తూ గ్రావెల్ (ఎర్రమట్టిని) తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. గ్రావెల్ లీజు తీసుకున్న మహిళకు ఏడాది క్రితం ప్రభుత్వ ఉద్యోగం వచ్చింది. లీజును మరొకరి పేరిట ట్రాన్స్‌ఫర్ చేసుకోకుండానే తవ్వకాలు సాగిస్తున్నారు.



● ఇక్కడ కనిపిస్తున్న రోడ్డు మెటల్ క్వారీ బొమ్మనహాళ్ మండలం నేమకల్లు గ్రామ సమీపంలో ఉంది. గనులశాఖ అధికారుల నుంచి రోడ్డు మెటల్ క్వారీ లీజు తీసుకున్నారు. పరిధికి మించి అదనంగా తవ్వకాలు చేస్తూ విలువైన రోడ్డు మెటల్‌ను సమీపంలోని కర్ణాటకకు తరలిస్తూ నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో రాత్రికి రాత్రే వందలాది టిప్పర్ల రోడ్డుమెటల్ తరలించేస్తున్నారు.

అనంతపురం టౌన్: గనుల శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. మెటల్, గ్రావెల్, గ్రానైట్ క్వారీల నిర్వాహకులు యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. అక్రమంగా తవ్వకాలు చేపట్టి.. రాత్రికి రాత్రే కర్ణాటకకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా 320కిపైగా క్వారీలున్నాయి. ఇందులో అత్యధికంగా రోడ్డు మెటల్ క్వారీలు 180, గ్రావెల్ క్వారీలు 30, గ్రానైట్ క్వారీలు 100కు పైగా ఉన్నాయి. గనులశాఖ అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో క్వారీల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. లీజు తీసుకున్న ప్రాంతంలో కాకుండా మరో ప్రాంతంలో తవ్వకాలు చేస్తూ విలువైన ఖనిజాన్ని అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. 'దొరికితే దొంగ.. లేదంటే దొరే' అన్న చందంగా వ్యవహారం సాగుతోంది.

హద్దులు చెరిపి.. అక్రమంగా తవ్వకాలు

బొమ్మనహాళ్ మండలం నేమకల్లు సమీపంలో 25కు పైగా రోడ్డు మెటల్ క్వారీలు ఉన్నాయి. వీటిలో చాలామంది క్వారీ నిర్వాహకులు హద్దులు చెరిపేసి అక్రమ తవ్వకాలు చేస్తున్నారు. రాయదుర్గం ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తికి దాదాపు నాలుగు రోడ్డు మెటల్ క్వారీలున్నాయి. ఇతను లీజు తీసుకున్న ప్రాంతంలో కాకుండా మరోచోట 3లక్షల క్యుబిక్ మీటర్లకు పైగా రోడ్డు మెటల్ తవ్వకాలు చేపట్టి, రవాణా చేసినట్లు తెలుస్తోంది. ఇదే విషయంపై రెండు నెలలుగా గనులశాఖ అధికారులకు ఫిర్యాదులు అందుతున్నా పట్టించుకోలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నేమకల్లు ప్రాంతంలోని రోడ్డు మెటల్ క్వారీల్లో చాలావాటికి పర్యావరణ అనుమతులు సైతం తీసుకోకుండా తవ్వకాలు చేస్తున్నారని అదే ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ఎన్‌జీటీ (నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్)కి ఫిర్యాదు చేశాడు.

ప్రభుత్వ ఆదాయానికి గండి

దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలనే సామెతను అక్రమార్కులు తూచ తప్పకుండా పాటిస్తున్నారు. అధికారులకు ముడుపులు ముట్టజెప్పి గ్రానైట్ అక్రమ రవాణాను నిరాటంకంగా సాగిస్తున్నారు. కొందరు ఒక్క పర్మిట్‌తో పదుల వాహనాల్లో అత్యంత విలువైన గ్రానైట్‌ను జిల్లా సరిహద్దు దాటిస్తుంటే.. మరికొందరు పర్మిట్లు లేకుండానే తవ్వకాలు చేస్తూ గ్రావెల్, రోడ్డు మెటల్‌ను దొడ్డిదారిన తరలించి ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు.

అక్రమ తవ్వకాలు చేస్తే కఠిన చర్యలు

క్వారీ లీజు అనుమతులు లేకుండా తవ్వకాలు చేసి ఖనిజాన్ని తరలిస్తే అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటాం. క్షేత్రస్థాయిలో పర్యటించి లీజు ప్రాంతాల్లో కాకుండా మరో ప్రాంతాల్లో తవ్వకాలు చేస్తున్న వారికి నోటీసులతోపాటు భారీగా జరిమానాలు విధించి, లీజు రద్దు చేస్తాం. ప్రభుత్వ అనుమతులు తీసుకున్న లీజు ప్రాంతాల్లోనే తవ్వకాలు చేపట్టి పర్మిట్లు తీసుకున్న తర్వాతే ఖనిజాన్ని తరలించాలి.

– గంజి వెంకటేశ్వర్లు, డిప్యూటీ డైరెక్టర్, గనులశాఖ

ఊపిరి నిలపండి

- ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌తో వెంటిలేటర్‌పై చిన్నారి
- ఆపన్నహస్తం కోసం తల్లిదండ్రుల వేడుకోలు



గౌతమ్ (ఫైల్)

రాయదుర్గం టౌన్ : పేదింటి చిన్నారికి పెద్ద కష్టం వచ్చింది. ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌తో చావుబతుకుల మధ్య పోరాడుతున్నాడు. ఆపన్నహస్తం అందించి కుమారుడిని కాపాడాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. రాయదుర్గం మండలం కాశీపురానికి చెందిన ఆటో డ్రైవర్ ప్రభాకర్, శైలజ దంపతులకు ఇద్దరు సంతానం. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో కుమార్తె స్నేహ 5వ తరగతి, కుమారుడు గౌతమ్ (7) రెండో తరగతి చదువుతున్నాడు. గత ఆదివారం గౌతమ్‌కు తీవ్రమైన జ్వరం రావడంతో కళ్యాణదుర్గం ఆర్డీటీ ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉందని అక్కడి నుంచి అనంతపురం సర్వజన ఆస్పత్రికి తీసుకొచ్చారు. గౌతమ్‌కు ఊపిరితిత్తులు దెబ్బతిన్నాయని, కర్నూలుకు తరలించాలని వైద్యులు సూచించారు. మంగళవారం అనంతపురంలోనే ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. గౌతమ్‌కు ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ ఎక్కువ కావడంతో ప్రస్తుతం వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స చేస్తున్నారు. ఇప్పటికే దాదాపు రూ.1.40 లక్షలు ఖర్చు చేశారు. ఇక వారి వద్ద వైద్యం చేయించడానికి డబ్బు లేదు. దయార్ద్ర హృదయులు ముందుకొచ్చి తమ కుమారుడి ప్రాణాలు నిలపాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దాతలు సహాయం చేయాలంటే గౌతమ్ మామ కె.ఉలిరాజు 96527 57649 నంబర్‌కు ఫోన్‌పే చేయలని కోరుతున్నారు.

దుష్టశక్తుల నుంచి సంఘాన్ని కాపాడుకుందాం



నూతన కార్యవర్గాలతో రాష్ట్ర నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘాన్ని దుష్టశక్తుల నుంచి కాపాడుకుందామని రాష్ట్ర అధ్యక్ష, ప్రధాకార్యదర్శులు ధర్మాల శ్రీకాంత్‌రాజు, జి.అస్కానరావు పిలుపునిచ్చారు. శనివారం అనంతపురంలోని ఉపాధ్యాయ భవనంలో సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యర్శులు మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అత్యంత బాధ్యాతాయుతమైన సంఘం అన్నారు. గత ఐదేళ్లలో ఉద్యోగుల సహకారంతో ఎంతో కష్టపడి సంఘాన్ని అభివృద్ధి చేసుకున్నామన్నారు. సంఘం పేరు చెప్పుకుంటూ ఒక చీకటి వ్యక్తి ఊరూరా తిరుగుతూ నాతో కలిసిరండి అద్భుతాలు సృష్టిస్తానంటూ ఉద్యోగులను నమ్మిస్తున్నారన్నారు. తన వ్యక్తిగత ఎదుగుదల కోసం సూర్యనారాయణ అనే వ్యక్తి ఆరాటపడుతున్నాడంటూ మండిపడ్డారు. ఆయనను కుతంత్రాలను పసిగట్టి సంఘం నుంచి బహిష్కరించామని చెప్పారు.

జిల్లా నూతన కమిటీ

ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పాటిల్ విజయభాస్కర్‌రెడ్డి (రెవెన్యూ), కార్యదర్శిగా జూపల్లి రమణకుమార్ (విద్యాశాఖ), కోశాధికారిగా లక్ష్మయ్య, ఉపాధ్యక్షులుగా కె.వెంకటేశులు, ఎ.గోవిందు, జె.చంద్రకాంతరావు, ఎం.జయరామిరెడ్డి, ఉప కార్యదర్శులుగా బాబు, పి.సమీరఖాన్, పి.గిరిధర్, పి.సుధాకర్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా శ్రీనివాస్, బాబా నూరుద్దీన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే నగర కమిటీ అధ్యక్షుడిగా బి.పెద్దన్న, కార్యదర్శిగా జిలాన్‌బాషా, ఉపాధ్యక్షులుగా పార్థసారథి, సి.వెంకటనారాయణ, అంజి, రాజునాయక్, ఉపకార్యదర్శులుగా రామాంజనేయులు, ఓబుళపతిని ఎన్నుకున్నారు.

పరిహారం.. ప్రహసనం

- ఎన్‌హెచ్ 544-డి నిర్మాణంలో కోల్పోతున్న 47 ఇళ్లు
- నిర్వాసితులకు అందని పరిహారం



రోటరీపురంలో కోల్పోనున్న ఇళ్లు

అనంతపురం అర్బన్: జిల్లాలో పాముడాయి నుంచి బుగ్గ వరకు జాతీయ రహదారి 544-డి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో బుక్కరాయసముద్రం మండలం రోటరీపురం(బోడిగానిదొడ్డి గ్రామం)లో దాదాపు 130 ఇళ్లను తొలగించాల్సి వస్తుందని అధికారులు గుర్తించారు. వీటిలో 47 ఇళ్ల విషయంలో రెవెన్యూ అధికారులు చేసిన తప్పిదం కారణంగా సమస్య తలెత్తింది. దానిని సరిదిద్దుకున్నప్పటికీ నిర్వాసితులకు పరిహారం చెల్లించే విషయంలో తీవ్రజాప్యం జరుగుతోంది.

తొలి తప్పిదం ఇలా...

రోడ్డు నిర్మాణంలో భాగంగా రోటరీపురంలో తొలగించాల్సిన 130 ఇళ్లను నేషనల్ హైవే, ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ అధికారులు సర్వే చేసి ఇళ్ల కొలతలు వేసి నిర్మాణ విలువను నిర్ధారించారు. ఇంత వరకు బాగానే ఉంది. రికార్డు తయారు చేసే క్రమంలో రెవెన్యూ అధికారులు చేసిన తప్పిదం నిర్వాసితులకు శాపంగా మారింది. కోల్పోతున్న 130 ఇళ్లలో 47 ఇళ్లకు సంబంధించిన 112-2 సర్వే నంబర్‌ను రాళ్లగుట్టగా నమోదు చేశారు. వాస్తవంగా వీరంతా 50 ఏళ్ల క్రితం ఇళ్లను నిర్మించుకుని నివాసముంటున్నారు. 1978లోనే ఈ ఇళ్లకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు. 1983లో వీరికి రెవెన్యూ శాఖ డి.పట్టా మంజూరు చేసింది. అయితే పరిహారం ఇచ్చేందుకు సిద్ధం చేసిన రికార్డులో ఈసర్వే నంబర్ రాళ్లగుట్టగా నమోదు కావడంతో ప్రభుత్వ స్థలంగా పేర్కొంటూ పరిహారం 'సున్నా'గా అనెగ్జర్‌లో పొందపరిచారు. దీంతో ఈ 47 ఇళ్లకు పరిహారం అందించే విషయంలో సమస్య తలెత్తింది.

సరిదిద్దినా అందని పరిహారం

తమ నుంచి జరిగిన తప్పిదం కారణంగా 47 ఇళ్లకు పరిహారం అందని పరిస్థితిని నెలకొన్నట్లు అధికారులు ఆలస్యంగా గుర్తించారు. జరిగిన తప్పును సరిదిద్దుకుని మరోమారు నివేదికను పంపినా కేంద్ర మంత్రిత్వ శాఖ నుంచి క్లియరెన్స్ రాలేదు. అప్పటి జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఉన్నతస్థాయి అధికారులతో మాట్లాడి నిర్వాసితులకు పరిహారం అందించేందుకు మార్గం సుగమం చేశారు. అయితే ఫైలు ఉన్నతాధికారులకు పంపే విషయంలో తీవ్ర జాప్యం చోటు చేసుకోవడంతో ఈ అంశం మళ్లీ మొదటికొచ్చింది.

కోర్టును ఆశ్రయించిన ఎన్‌హెచ్

కలెక్టర్‌గా వినోద్‌కుమార్ బాధ్యతలు తీసుకున్న వెంటనే పరిహారం అంశంపై అధికారులతో సమీక్షించారు. ఇళ్లకు అప్పటికే నిర్ణయించిన పరిహారాన్ని ఖరారు చేశారు. రోడ్డు నిర్మాణ క్రమంలో 47 మంది నిర్వాసితులు తమ ఇళ్లతో పాటు 60 సెంట్ల ఖాళీ స్థలాలను కోల్పోతున్నారు. నిర్వాసితులు సంతృప్తి చెందేలా ధర నిర్ణయిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ ఆర్డర్‌పై ఎన్‌హెచ్ అధికారులు కోర్టును ఆశ్రయించడంతో నిర్వాసితులకు ఎదురుచూపు తప్పలేదు.

వీధినపడతాం



రోటరీపురంలో ఇళ్లు నిర్మించుకుని 50 ఏళ్లగా నివాసముంటున్నాం. 1983లో మాకు పట్టాలు ఇచ్చారు. రోడ్డు నిర్మాణంలో 130 ఇళ్లను తొలగిస్తున్నారు. మా ఇళ్లను కొలతలు కూడా వేశారు. అయితే మా 47 కుటుంబాలకు సంబంధించిన సర్వే నంబరు 112-2ను రాళ్లగుట్టగా నమోదు చేశారు. దీన్ని సరిచేసి పంపినా ఇప్పటికీ పరిహారం అందలేదు. మాకు పరిహారం ఇవ్వకపోతే మా కుటుంబాలు వీధిపడతాయి.

– కిష్ట, నిర్వాసితుడు, రోటరీపురం

అందరితోపాటు మాకూ ఇవ్వాలి



గ్రామంలో ఇళ్లను కోల్పోతున్న వారికి ఏ విధంగా పరిహారం ఇచ్చారో మాకు అదే విధంగా పరిహారం ఇవ్వాలి. లేకపోతే తీవ్రంగా నష్టపోతాము. ఇప్పుడున్న పరిస్థితుల్లో బతకడమే కష్టంగా ఉంది. ఇంటిని కోల్పోతే తిరిగి కట్టుకునే స్థోమత లేదు. అధికారులు ఈ విషయంలో మాకు న్యాయం చేసి అందరిలా మాకు పరిహారం వచ్చేలా చూడాలి.

– వెంకటనాయుడు, నిర్వాసితుడు,రోటరీపురం

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్



స్వాధీనం చేసుకున్న బైక్‌లతో డీఎస్పీ వెంకటేశులు, సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా

గార్లదిన్నె: ఉమ్మడి జిల్లాలో ద్విచక్ర వాహనాలు ఎత్తుకెళ్లే దొంగను గార్లదిన్నె పోలీసులు అరెస్ట్ చేశారు. అతని నుంచి 24 బైక్‌లు రికవరీ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు గార్లదిన్నె పోలీస్ స్టేషన్‌లో మీడియాకు వెల్లడించారు. సంజీవపురానికి చెందిన శంకర్ సాయికుమార్ అనే యువకుడు పదవ తరగతి వరకు చదువుకున్నాడు. జల్సాలకు అలవాటుపడి, ఇతరుల వద్ద అప్పులు చేశాడు. ఆ అప్పులు తీర్చడానికి ద్విచక్రవాహనాల దొంగగా మారాడు. చోరీ చేసిన బైక్‌లను పలు ప్రాంతాల్లో తక్కువ ధరకు విక్రయించేవాడు. పలు పోలీస్ స్టేషన్లలో కేసులు కూడా నమోదయ్యాయి. రెండు రోజుల క్రితం గార్లదిన్నె మండల పరిధిలోని కల్లూరులో సంజీవరెడ్డి సర్కిల్‌లో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాన్ని శంకర్ సాయికుమార్ నకిలీ తాళంతో స్టార్ట్ చేసి కోటంక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాస్థానం సమీపంలో పాడుబడిన రేకులషెడ్డులో దాచాడు. శుక్రవారం ధర్మవరానికి చెందిన తిరుపాల్ అనే వ్యక్తి కల్లూరులో పార్కింగ్ చేసిన తమ ద్విచక్రవాహనం చోరీ అయ్యిందని ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. రేకులషెడ్‌లోని బైక్ తీసుకుని బెంగళూరులో అమ్మాలని వెళ్తుండగా సమాచారం అందుకున్న సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా, పోలీస్ ప్రత్యేక బృందం సంఘటన స్థలానికి చేరుకుని నిందితుడు శంకర్ సాయికుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. అనంతపురం, గార్లదిన్నె, నార్పల, శింగనమల, నంద్యాల, ధర్మవరం, ఆదోని, బాగేపల్లి ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలు దొంగిలించినట్లు నిందితుడు ఒప్పుకున్నాడు. అతనిచ్చిన సమాచారం మేరకు 24 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని శనివారం అనంతపురం కోర్టులో హాజరుపరిచారు. బైక్‌ల రికవరీలో పాల్గొన్న పోలీసు బృందాన్ని ఎస్పీ అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.

గంజాయి అమ్ముతున్న బాలుడి అరెస్ట్

అనంతపురం: కలెక్టరేట్ సమీపంలోని గోశాల వద్ద గంజాయి అమ్ముతున్న బాలుడిని వన్‌టౌన్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. వజ్రకరూరు మండలానికి చెందిన నేతాజీ అనే వ్యక్తి వద్ద కిలో రూ.10 వేల చొప్పున గంజాయి కొనుగోలు చేసి.. వాటిని చిన్న చిన్న పొట్లాలుగా చేసి, రోజూ గోశాల వద్ద అమ్మకాలు సాగించేవాడు. ఈ బాలుడు అనంతపురం మారుతీనగర్‌కు చెందిన వాడని సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్ తెలిపారు.

పశువుల కంటైనర్ పట్టివేత



కంటైనర్‌లో ఉన్న గోవులు

పెద్దవడుగూరు/ పామిడి : పశువులను అక్రమంగా తరలిస్తున్న కంటైనర్‌ను కేశపల్లి టోల్‌గేట్ వద్ద శనివారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్ జిల్లా పెబ్బేరు నుంచి పశువులతో వస్తున్న కంటైనర్‌ను పెద్దవడుగూరు మండలం కేశపల్లి టోల్‌గేట్ వద్ద ఓ పాత్రికేయుడు గమనించి పోలీసులకు సమాచారమందించారు. వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకు పరిశీలించగా 30 ఎద్దులను గుర్తించారు. విచారణ చేయగా... ఆదివారం అనంతపురంలో జరిగే సంతకు తీసుకెళ్తున్నట్లు పశువులను తరలిస్తున్న వారు తెలిపారని ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. అనుమతులు లేకుండా తరలిస్తున్నందున వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

ఎస్ఎల్‌టీఏ రాష్ట్ర కమిటీలో ఉమ్మడి జిల్లాకు ప్రాధాన్యత



గాండ్లపర్తి శివానందరెడ్డి,హరినాథ్, నరసింహమూర్తి, శచీదేవి, కరియన్న, నీలోఫర్ జాన్

అనంతపురం ఎడ్యుకేషన్: రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ (ఎస్ఎల్‌టీఏ) ఆంధ్రప్రదేశ్ కమిటీలో ఉమ్మడి జిల్లాకు ప్రాధాన్యత లభించింది. శనివారం తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రిలో ఎస్ఎల్‌టీఏ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అనంతపురం జిల్లాకు చెందిన గాండ్లపర్తి శివానందరెడ్డిని ఎన్నుకున్నారు. అలాగే ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి ఉపాధ్యక్షులుగా బి.నరసింహమూర్తి, కే శచీదేవి, కార్యదర్శిగా నీలోఫర్ జాన్, ఆడిట్ కమిటీ కన్వీనర్ గా ఎం.హరినాథ్, లీగల్ కమిటీ సభ్యులుగా ఎం.కరియన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కమిటీలో సముచిత స్థానం కల్పించినందుకు అనంతపురం జిల్లా అధ్యక్ష ప్రధానకార్యదర్శులు వై.ఆదిశేషయ్య, జి.వేణుగోపాల్, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.ఆనందరెడ్డి, రవికుమార్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రధానకార్యదర్శి గాండ్లపర్తి శివానందరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తామన్నారు. భాషా పండితుల సమస్యలు పరిష్కరించాలని, 117 జీవో రద్దు చేయాలని, ఐఆర్ ప్రకటించాలని, పీఆర్సీ కమిషన్ పూర్తిస్థాయిలో నియమించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం 10వ తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులకు తెలుగు మాధ్యమంలో రాయడానికి అవకాశం కల్పించాలని కోరారు.

● ఇదీ అమ్మ ప్రేమంటే!



ఆ ఇల్లాలు ఏదో పనిమీద తన ఇద్దరు పిల్లలతో ద్విచక్రవాహనంపై బయటకు వచ్చింది. అయితే ఆ పిల్లలు బైక్‌పైనుంచి జారి కిందపడకుండా చున్నీతో నడుముకు కట్టుకుంది. పిల్లల పట్ల ఆమె తీసుకున్న జాగ్రత్తలను పలువురు ఆసక్తిగా తిలకించారు. తల్లి తన పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకుంటుంది అనడానికి ఇదొక నిదర్శనంగా నిలిచింది. శనివారం అనంతపురం క్లాక్‌టవర్ వద్ద ఈ దృశ్యాన్ని 'సాక్షి' క్లిక్‌మనిపించింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై కట్టెలతో దాడి

బుక్కరాయసముద్రం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపై టీడీపీ నాయకులు కట్టెలతో దాడి చేసిన సంఘటన శనివారం సాయంత్రం మండల పరిధిలోని కొర్రపాడు గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త తలారి పరమేష్ టీడీపీ నాయకుడు నాగభూషణకు గతంలో డబ్బులు అప్పుగా ఇచ్చాడు. తిరిగివ్వాలని అడిగినా నాగభూషణ పట్టించు కోలేదు. ఈ క్రమంలో శనివారం మరోసారి డబ్బు ఇవ్వాలని అడగ్గా నాగభూషణతో పాటు అతని ఐదుగురు అనుచరులు రెచ్చిపోయారు. ఇంట్లో ఉన్న పరమేష్, అతని భార్య పార్వతి, తమ్ముడు ఆనంద్, అతని భార్య మునేశ్వరిని కట్టెలతో తీవ్రంగా కొట్టారు. దిక్కున్న చోట చెప్పుకోపొండంటూ హెచ్చరించారు. స్థానికులు క్షతగాత్రులను అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైతు ఇంట్లో చోరీ



వేలి ముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం సభ్యులు

గుత్తి: పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలో నివాసముంటున్న రైతు ఇంట్లో చోరీ జరిగింది. 9.5 తులాల బంగారు ఆభరణాలు, 3 కిలోల వెండి వస్తువులు అపహరించుకుపోయారు. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎస్‌బీఐ కాలనీలో రైతు నాగిరెడ్డి, శ్రీదేవి దంపతులు నివాసముంటున్నారు. వీరు నాలుగు రోజుల క్రితం ఇంటికి తాళాలు వేసి కుటుంబ సభ్యులతో కలిసి స్వస్థలం నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం కౌలుపల్లికి వెళ్లారు. శనివారం తిరిగి ఇంటికి వచ్చారు. తలుపులు తెరిచి ఉండటంతో అనుమానం వచ్చి లోపలికి వెళ్లి చూశాడు. బీరువాలో భద్రపరచిన 4 తులాల గుండ్లమాను బంగారు గొలుసు, రెండున్నర తులాల నల్లపూసల దండ, మరో మూడు తులాల లాంగ్‌చైన్‌తో పాటు 3 కిలోల వెండి వస్తువులు (చెంబు, ప్లేట్లు, గ్లాసులు, దీపారాధన వస్తువులు, కుంకుమ భరణీలు, కలశాలు వంటివి) కనిపించలేదు. చోరీకి గురైనట్లు తెలుసుకుని బాధితులు నాగిరెడ్డి, శ్రీదేవి దంపతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ సురేష్ చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. ఆధారాల కోసం ఆరా తీశారు. అనంతరం క్లూస్ టీం వచ్చి తలుపులు, కిటికీలు, బీరువాలపై వేలిముద్రలు సేకరించారు.

క్లుప్తంగా

హోటళ్లలో మద్యం విక్రయిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎస్ఐ లక్ష్మీనారాయణ

ఆత్మకూరు: ఆత్మకూరు గ్రామంలో, బైపాస్‌లో ఉన్న హోటళ్లలో మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ లక్ష్మీనారాయణ హెచ్చరించారు. శనివారం హోటళ్ల నిర్వాహకులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి మాట్లాడారు. ముఖ్యంగా బైపాస్‌లో హోటళ్లు నిర్వహిస్తున్న వారు జాగ్రత్తగా ఉండాలన్నారు. మద్యం విక్రయించినట్లు తెలిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంతేకాకుండా బైపాస్‌లలో హోటళ్ల ముందు వాహనాలు పార్కింగ్ చేయొద్దని సూచించారు. అలా వాహనాలు నిలపడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. వాహనాలను రోడ్డు పక్కన కాకుండా దూరంగా పార్కింగ్ చేయించాలని సూచించారు.

నేడు రుద్ర సహిత సర్పశాంతి హోమం

ఆత్మకూరు: కార్తీకమాస ఉత్సవాల్లో భాగంగా పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం సర్పభూషణ రుద్ర సహిత సర్పశాంతి హోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే స్వామికి పంచామృతాభిషేకాలతో పాటు విశేష పూజలు, ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున కాల సర్పదోష నివారణ రాహు కేతు హోమాలు జరుగుతాయని పేర్కొన్నారు.

పనులు వేగవంతం చేయాలి



సీసీ రోడ్డును పరిశీలిస్తున్న డ్వామా పీడీ సలీం బాషా

ఆత్మకూరు: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఎన్ఆర్‌జీఎస్ కింద చేపట్టిన రోడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని డ్వామా పీడీ సలీం బాషా అధికారులకు సూచించారు. శనివారం మండలంలోని బి.యాలేరు, మదిగుబ్బ, సనప గ్రామాల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, షెడ్ల నిర్మాణాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులు నాణ్యతగా చేపట్టాలని ఆదేశించారు. ఈ పనులు డిసెంబర్‌లోపు పూర్తి చేసి వచ్చే ఏడాది సంక్రాంతి పండుగకు ప్రారంభించేలా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలన్నారు. అలాగే గడ్డి పెంపకం కోసం ఆసక్తి గల రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీనరసింహా, ఆర్‌డబ్ల్యూ ఏఈ శివకుమార్, పీఆర్ ఇంజినీర్ పార్థసారథి, ఏపీఓ సుజాత, ఈసీ భాస్కర్ పాల్గొన్నారు.

రేపు నేషనల్ ఎడ్యుకేషన్ డే

అనంతపురం రూరల్: మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 11న మైనార్టీ వెల్ఫేర్, నేషనల్ ఎడ్యుకేషన్ డే నిర్వహిస్తున్నట్లు మైనార్టీ సంక్షేమశాఖ ఏడీ రామసుబ్బారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు టవర్‌క్లాక్ వద్ద ఉన్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ విగ్రహానికి నివాళులర్పించడం జరుగుతుందన్నారు. అనంతరం 11 గంటలకు జిల్లా ప్రజా పరిషత్ హాలులో సభ ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, ముస్లిం మత పెద్దలు ప్రజలు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

అక్రమ మద్యం స్వాధీనం

ఆత్మకూరు: మదిగుబ్బ గ్రామంలో శనివారం పోలీసులు కార్డెన్ సెర్చ్ చేపట్టారు. అక్రమ మద్యం విక్రయిస్తున్నారని సమాచారం రావడంతో అనుమానితుల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. పోతన్న ఇంట్లో 40 అక్రమ మద్యం బాటిళ్లు దొరికాయి. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, పోతన్నపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

అటకెక్కిన చెత్త సేకరణ



ఓబులదేవనగర్‌లో పేరుకుపోయిన చెత్త

అనంతపురం కార్పొరేషన్: నగరంలో చెత్త సేకరణ అటకెక్కింది. ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించాల్సిన క్లాప్ ఆటోలు పూర్తి స్థాయిలో వెళ్లడం లేదు. దీంతో చెత గుట్టలు గుట్టలు పడి ఉంటోంది. నగరంలోని పాతూరు, రాణినగర్, నీరుగంటి వీధి, జీసస్‌నగర్, అరవింద నగర్, నాయక్ నగర్, అశోక్ నగర్, సాయినగర్, తదితర ప్రాంతాల్లో చెత్త సేకరణ పూర్తిస్థాయిలో జరగడం లేదు. నగరపాలక సంస్థ కమిషనర్ నాగరాజు చెత్త సేకరణకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటామని చెబుతున్నా.. అది మాటలకే పరిమితమవుతోంది. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి, ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటే బాగుంటుందని నగర వాసులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు మేలుకుంటారో లేదో వేచి చూడాలి.

చొరవ చూపితే ఆదాయమే..

- నిరుపయోగంగా చెత్త సంపద కేంద్రాలు
- నిధులు 'చెత్తపాలు'
- మందు బాబులకు అడ్డాగా మారుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు





ప్యాదిండిలో నిరుపయోగంగా ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం (ఇన్‌సెట్‌లో) తొట్టిలో పడేసిన మద్యం సీసాలు

చెన్నేకొత్తపల్లి: చెత్త నుంచి సంపద సృష్టించి.. వచ్చే ఆదాయాన్ని పంచాయతీల అభివృద్ధికి వినియోగిస్తామని గొప్పలు చెప్పిన కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడంలో విఫలమైంది. కనీసం వాటి గురించి నోరుమెదపడం లేదు. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిరపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఈ కేంద్రాల నిర్మాణానికి ఉపాధిహామీ పథకం నిధులు ఖర్చు చేశారు. బ్యాటరీ బండ్లు, మేజర్ పంచాయతీలకు ట్రాక్టర్లు, జనాభా ఎక్కువ ఉంటే ట్రాక్టర్, గాజు సీసాలు పొడి చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక యంత్రాలు కేటాయించింది. ఈ కేంద్రాల్లో పని చేసేందుకు గత ప్రభుత్వం క్లీన్ మిత్రలను కూడా నియమించింది. వీరు వీధుల నుంచి చెత్తను సేకరిస్తారు. తడి, పొడి చెత్తతో పాటు గాజు, పెంకు, ప్లాస్టిక్‌లుగా వేరు చేస్తారు. వాటిని వేర్వేరు తొట్టిల్లో వేసి కుళ్లించి, వానపాములతో సేంద్రియ ఎరువులు తయారు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇక్కడ తయారైన ఎరువును ప్యాకెట్లుగా తయారు చేసి రైతులకు విక్రయించాలి. కిలో కంపోస్ట్ ఎరువు రూ.8 నుంచి రూ.10 వరకు విక్రయిస్తే ఆదాయం సమకూరుతుంది. తయారైన ఎరువులను రైతులకు విక్రయించాలని పెట్టుకున్న లక్ష్యం నీరుగారింది. సంపద తయారీ కేంద్రాలు షెడ్లకే పరిమితమయ్యాయి. గ్రామాల నుంచి చెత్తను సేకరించి వానపాముల ద్వారా ఎరువుల తయారీ పడకేసింది. ఎక్కడ చూసిన మురుగు కాలువలు, వీధుల్లో చెత్త, ప్లాస్టిక్, గాజు సీసాలు పేరుకుపోతున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు.

ప్రజాధనం వృథా..

లక్షలాది రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా మారడంతో అవి మందుబాబులకు స్థావరాలుగా మారాయి. గ్రామాలకు కొంతదూరంలో ఉండటంతో అసాంఘిక కార్యక్రమాలకు నిలయాలుగా మరుతున్నాయి. కొన్నిచోట్ల అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోక పోవడంతో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. చెన్నేకొత్తపల్లి మండలంలో 15 గ్రామ పంచాయతీలు ఉండగా అందులో 14 గ్రామ పంచాయతీలకు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ప్రభుత్వం 2017–18లో మంజూరు చేసింది. ఒక్కొక్క కేంద్రానికి సుమారు రూ.3.50 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ వెచ్చించి నిర్మించారు. కనీసం ఖర్చు చేసిన దానిలో కొంత ఆదాయం కూడా రాకుండా పోయిందని ఆయా గ్రామాల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటిపై చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉంది. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పర్యవేక్షించాలి. చెత్త నుంచి ఆదాయం పెంచుకుని ఆ మొత్తాన్ని గ్రామ పంచాయతీల అభివృద్ధికి వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వినియోగంలోకి తేవాలి



చెత్త నుంచి సంపద తయారీ చేసేందుకు షెడ్లను నిర్మించడం బాగుంది. అయితే ఇవి నిరుపయోగంగా ఉండటంతో అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారాయి. ప్రభుత్వం చొరవ తీసుకుని సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకుని రావాలి. ఎరువుల తయారీకి ప్రణాళికలు రూపొందించాలి. వర్మీకంపోస్టును తయారు చేసి, స్థానికంగా ఉండే రైతులకు విక్రయించండం ద్వారా ఆదాయం సమకూర్చుకోవచ్చు. ఈ ఆదాయాన్ని పంచాయతీ అభివృద్ధికి ఖర్చు చేయాలి.

– అంజి, గువ్వలగొందిపల్లి, ముష్టికోవెల

త్వరలో పనులు ప్రారంభిస్తాం



మండలంలో ఉన్న 14 చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో త్వరలో పనులు ప్రారంభిస్తాం. గతంలో ఇందులో పని చేసే వారు పని మానేయడంతో పనులు జరగలేదు. త్వరలో పనులను ప్రారంభిస్తాం. కేంద్రాల్లో ఎరువుల తయారీని ప్రారంభించి, పంచాయతీలకు ఆదాయం వచ్చేలా కృషి చేస్తాం.

– అశోక్‌కుమార్ నాయక్, ఈఓఆర్డీ, చెన్నేకొత్తపల్లి మండలం

నిండా ముంచిన పురుగు మందులు



మందు కొట్టక ముందు కళకళలాడుతున్న పంట



మందులు కొట్టిన తర్వాత ఆకులు ముడుచుకుపోయిన దృశ్యం

- తెగుళ్ల నివారణకు మందు కొడితే.. పూర్తిగా దెబ్బతిన్న బీర పంట
- రూ.లక్షల పెట్టుబడి నష్టం



పంటకు కొట్టిన మందులివే

రాప్తాడు రూరల్: సాగు చేసిన పంటకు తెగుళ్లు ఆశించకూడదనే ఉద్దేశంతో ముందుజాగ్రత్తగా మందులు కొడితే పంట మొత్తం మాడిపోవడంతో కౌలు రైతులు లబోదిబోమంటున్నారు. బాధిత రైతులు తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి గ్రామానికి చెందిన రైతులు రాజేంద్ర, శేఖర్‌రెడ్డి గ్రామ సమీపంలో కొంత భూమిని కౌలుకు తీసుకుని సాగు చేసుకుంటున్నారు. 2.5 ఎకరాల్లో నెల క్రితం బీర పంట సాగు చేశారు. పైరు ఆశాజనకంగా ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు కూడా పంట దెబ్బతినకుండా కాపాడుకున్నారు. ఆరు రోజుల కిందట.. రుద్రంపేట సమీపంలోని ఓ ఫర్టిలైజర్స్ దుకాణం వద్దకు వెళ్లి ఊజి, దోమకాటుకు గురికాకుండా మందులు కావాలని అడిగారు. షాపు యజమాని సూచనల మేరకు మూడు రకాల మందులు కొనుగోలు చేసి 450 లీటర్లలో కలిపి పంటపై పిచికారీ చేశారు. మరుసటి రోజు నుంచి అక్కడక్కడ మొక్కల్లో ఆకులు మాడిపోయినట్లు కనిపించాయి. ఇలా రోజు రోజూ పెరిగిపోయి ప్రస్తుతం పంటంతా పూర్తిగా దెబ్బతింది. వెంటనే ఈ విషయాన్ని ఫర్టిలైజర్స్ దుకాణం యజమాని దృష్టికి బాధిత రైతులు తీసుకెళ్లారు. ఎక్కువ మోతాదులో స్ప్రేయింగ్ చేయడం వల్ల ఇలాంటి సమస్య వచ్చి ఉంటుందని, తగ్గిపోతాదంటూ సలహా ఇచ్చాడు. పైగా ఎకరాకు అర్ధలీటరు మోతాదులో మరోరకం ఫుడ్ వేయాలంటూ రైతులకు సూచించారు. దుకాణం యజమాని చెప్పినట్లు ఫుడ్ కూడా పంటకు వదలివారు. అయినా పంటలో ఏమాత్రం మార్పు రాలేదు. దీంతో దుకాణ యజమానితో గొడవకు దిగాడు. రెండు రోజుల కిందట పంటను పరిశీలించిన దుకాణ యజమాని తాను ఏమీ చేయలేనంటూ చేతులెత్తేశాడు. దీంతో బాధిత రైతు లోబదిబోమంటున్నారు. కౌలుకు భూమి తీసుకుని రూ.2.70 లక్షలకుపైగా పెట్టుబడులు పెట్టి పంట సాగు చేస్తే తీరా చేతికొచ్చేసరికి.. ఇలా మొత్తం దెబ్బతినిందంటూ వాపోతున్నారు. ఫర్టిలైజర్స్ షాపు యజమాని నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారంటూ ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకుని తమను ఆదుకోవాలంటూ రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ధరల నియంత్రణలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర నాయకుడు ఓబులు

అనంతపురం రూరల్: ఎన్నికల సమయంలో ప్రజలకు హామీలు ఇవ్వడం అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీలను విస్మరించడం సీఎం చంద్రబాబుకు పరిపాటిగా మారిందని సీపీఎం రాష్ట్ర నాయకుడు ఓబులు మండిపడ్డారు. ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా శనివారం అనంతపురం రూరల్ పంచాయతీలో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాపోరు కార్యక్రమం నిర్వహించారు. సీపీఎం రాష్ట్ర నాయకుడు ఓబులు మాట్లాడుతూ.. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశనంటుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. సామాన్యుల నడ్డి విరుస్తున్నాయన్నారు. అంతర్జాతీయంగా డీజిల్, పెట్రోల్ ధరలు తగ్గినప్పటకీ మన దేశంలో మాత్రం పెట్రోల్, డీజిల్ ధరలు పెరురుగుతూనే ఉన్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలుగుతున్నా పాలకులు ఏమాత్రం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. మహిళలు, దళితులు, బాలికలపై దాడులు, అత్యాచారాలు జరుగుతున్నా ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. మంత్రులు ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటూ తప్పించుకోవడం సిగ్గుచేటన్నారు. ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ఉచితంగా ఇసుక అందించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్‌వీ నాయుడు, ముర్తు, ఇర్ఫాన్, నాగరాజు పాల్గొన్నారు.

ఆ ఇంటి అల్లుడే దొంగోడు

- కేసును ఛేదించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

ధర్మవరం రూరల్: బంగారు ఆభరణాల చోరీ కేసును పోలీసులు ఛేదించారు. చోరీ చేసిన వ్యక్తి ఆ ఇంటి అల్లుడే అని తేల్చారు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం ధర్మవరం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ శ్రీనివాసులు మీడియాకు వెల్లడించారు. ఈ నెల ఐదో తేదీన గొట్లూరు ఎస్సీ కాలనీలో నివాసముంటున్న సాకే ఓబులమ్మ ఇంట్లో దొంగతనం జరిగింది. ఇంటి తాళాలను పగులగొట్టి బీరువాలోని 6.5 తులాల బంగారు ఆభరణాలు అపహరించుకుపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్పీ రత్న, డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ ప్రభాకర్ సూచనలతో చోరీ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని దర్యాప్తు చేపట్టారు. చోరీ జరగడానికి ముందు అక్కడ ఎవరెవరు సంచరించారు అన్న వివరాలు సేకరించిన పోలీసులకు ఆ ఇంటి అల్లుడి గురించి తెలిసింది. అనుమానితుడి కింద ఆరా తీశారు. అప్పుడు అసలు విషయం వెలుగుచూసింది. ఓబులమ్మ పెద్ద కూతురు పుష్పాంజలిని పదేళ్లక్రితం ధర్మవరం పట్టణం ఇందిరమ్మ కాలనీకి చెందిన చందమామ రవికి ఇచ్చి వివాహం జరిపించింది. మూడేళ్లపాటు వీరి కాపురం అన్యోన్యంగా సాగింది. అనంతరం ఇద్దరి దంపతుల మధ్య గొడవలు రావడంతో విడిపోయారు. అప్పటి నుంచి పుష్పాంజలి గొట్లూరులోని తల్లి వద్దే ఉండేది. అల్లుడు చందమామ రవి చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. ఈ క్రమంలో తన అత్తగారింట్లోనే చోరీ చేయాలని నిర్ణయించుకున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో రవి ఇంటి తలుపులను పగులగొట్టి బీరువాలోని బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లాడు. రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు కేసును ప్రత్యేకంగా తీసుకొని విచారణ చేపట్టారు. అందులో భాగంగా ఎస్ఐ తన సిబ్బందితో వెళ్లి నాగలూరు బస్టాప్ వద్ద అనుమానాస్పదంగా వున్న చందమామ రవిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ కేసును ఛేదించిన రూరల్ ఎస్ఐ శ్రీనివాసులను, పోలీస్ సిబ్బందిని ఎస్పీ, డీఎస్పీ, సీఐలు అభినందించారు.

అపురూప దృశ్యం



గర్భిణులు, బాలింతలు, క్షతగాత్రులు, తదితరులకు మెరుగైన సేవలందించడంలో స్టాఫ్‌నర్సుల పాత్ర కీలకం. వైద్యులు కొద్ది పాటి సమయం కేటాయించి వైద్య సేవలందిస్తే.. రౌండ్ ద క్లాక్ సేవలందించడంలో స్టాఫ్‌నర్సులు ముందు వరుసలో ఉంటారు. అటువంటి స్టాఫ్‌నర్సులను ఫ్లోరెన్స్ నైటింగేల్‌తో పోల్చుతారు. శనివారం ప్రభుత్వ ఆస్పత్రిలో ఓ బాలింత ప్రసవం అనంతరం ఇంటికి వెళ్లే సమయంలో ఫ్లోరెన్స్ నైటింగేట్ విగ్రహం ముందు ఆగారు. గర్భిణికి ఏడు రోజుల పాటు ఆస్పత్రిలో సేవలందించిన తర్వాత తల్లీబిడ్డను ఫ్లోరెన్స్ నైటింగేల్ ఆశీర్వదిస్తున్నట్లు కనిపించిన చిత్రమిది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:

ముగిసిన లీడర్‌షిప్, ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ



లీడర్‌షిప్ శిక్షణ ముగింపులో మాట్లాడుతున్న డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం ఎడ్యుకేషన్: ఈ నెల 4 నుంచి ప్రారంభమైన తొలివిడత లీడర్‌షిప్, రెండో విడత ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణలు శనివారంతో ముగిశాయి. రెండు శిక్షణలూ ఆరు రోజుల పాటు రెసిడెన్షియల్ పద్ధతిలో జరిగాయి. నగర శివారులోని బళ్లారిరోడ్డు సీఆర్‌ఐటీలో జరిగిన లీడర్‌షిప్ ట్రైనింగ్‌లో అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య జిల్లాల నుంచి మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు మొత్తం 249 మంది హాజరయ్యారు. బుక్కరాయసముద్రం సమీపంలోని విజయభారతి డీఎడ్ కళాశాలలో జరిగిన ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణకు అనంతపురం, కర్నూలు జిల్లాల నుంచి 235 మంది 1, 2 తరగతులు బోధించే ఎస్జీటీ టీచర్లు హాజరయ్యారు. లీడర్‌షిప్ ట్రైనింగ్ ముగింపు సందర్భంగా డీఈఓ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ శిక్షణలో భాగంగా నేర్చుకున్న అంశాలను మండలాలు, పాఠశాలల్లో అమలు చేయాలన్నారు. నాయకత్వ లక్షణాలను తాము పాటిస్తూ ఉపాధ్యాయులు, విద్యార్థుల్లో పెంపొందింపజేయాలన్నారు. ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ ముగింపు సందర్భంగా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ నాగరాజు మాట్లాడుతూ 1, 2 తరగతుల పిల్లల స్థాయికి వారితో మమేకమై బోధన చేయాలన్నారు. వివిధ రకాల బోధనా పద్ధతులను అవలంబించాలని, అప్పుడే చిన్న పిల్లలకు సులభంగా అర్థమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఉప విద్యాధికారి శ్రీనివాసులు, రాష్ట్ర పరిశీలకులు హైమేశ్వరరావు, ఏఎంఓ చంద్రశేఖర్ రెడ్డి, రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

శిక్షణల పేరుతో బోధనకు దూరం



సమావేశంలో పాల్గొన్న యూటీఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: శిక్షణల పేరుతో ప్రభుత్వం టీచర్లను బోధనకు దూరం చేస్తోందని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) నాయకులు మండిపడ్డారు. శనివారం యూటీఎఫ్ కార్యాలయంలో జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య మాట్లాడుతూ ప్రస్తుతం పాఠశాలల్లో విద్యార్థులకు అపార్ ఐడీలు నమోదు చేయాలని ఒక వైపు ఒత్తిడి తీసుకువస్తూనే, ఆధార్ అప్డేషన్ చేయించాలనిని, పదో తరగతి విద్యార్థులకు నామినల్ రోల్స్ తయారు చేయాలని, ఎఫ్ఏ–2 పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలని, ఈ నెల 14న మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ జరపాలని, పూటకోసారి అపార్ అప్డేషన్ తెలపాలని, రోజుకోసారి వెబెక్స్ మీటింగ్‌లు పెట్టి టీచర్లను ఒత్తిడికి గురి చేస్తున్నారన్నారు. ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేస్తూ తీవ్ర మానసిక ఒత్తిడితో కూడిన కార్యక్రమాలకు దూరం చేయాలని, ప్రశాంత వాతావరణంలో బోధన కొనసాగే పరిస్థితులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం ఇదే నిరంకుశ వైఖరి కొనసాగిస్తే భవిష్యత్తులో ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప, సహాధ్యక్షులు రామప్ప, సరళ, గౌరవాధ్యక్షులు రమణయ్య, నాయకులు ఈశ్వరయ్య, దేవేంద్రమ్మ, ప్రమీల, రఘురామయ్య, అబ్దుల్ వహాబ్, శేఖర్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేయించుకోండి

రాప్తాడు: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేయించుకోవాలి. వంద శాతం తప్పులు లేని ఓటర్ జాబితాను తయారు చేయాల్సిన బాధ్యత బూత్‌లెవెల్ ఆఫీసర్లపై ఉందని నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి జి.రమేష్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని 16 పంచాయతీల్లో ప్రత్యేక ఓటర్ నమోదు, సవరణల కార్యక్రమాన్ని చేపట్టారు. రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగే ఓటర్ నమోదును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రత్యేకంగా ఓటు హక్కు లేని వారిని గుర్తించి నమోదు చేయాలని సూచించారు. ఆయా దరఖాస్తు వివరాలను ప్రత్యేక రిజిష్టర్లలో పొందుపరచాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయకుమారి, ఈడీటీ సువర్ణ, బీఎల్వోలు పాల్గొన్నారు.

ధాబాలు, రెస్టారెంట్లలో మద్యపానం నిషేధం

అనంతపురం: ధాబాలు, రెస్టారెంట్లలో మద్యపానాన్ని అనుమతించినా, రహస్యంగా విక్రయాలు సాగించినా చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ పి. జగదీష్ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలోని ధాబాలు, రెస్టారెంట్ల యజమానులతో ఆయా డీఎస్పీలు, సీఐలు శనివారం ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. మద్యపానాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరాదన్నారు. రహస్యంగా మద్యం అక్రమంగా విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ విషయంపై ప్రతి ధాబా, రెస్టారెంటులో ఫ్లెక్సీలు, బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా జయరాం



అనంతపురం: గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా కటిక జయరాంను ఎంపిక చేశారు. శుక్రవారం కడపలో ఏర్పాటు చేసిన రాయలసీమ ప్రాంతీయ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబు, ప్రధాన కార్యదర్శి నాదెండ్ల బాబ్జి అడ్‌హాక్ కార్యవర్గ కమిటీని ఆమోదిస్తూ ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎం.బొజ్జనాయక్, ఉపాధ్యక్షులుగా జి.కృష్ణ, కోశాధికారిగా శ్రీనివాసులును నియమించారు.

'మైనార్టీలపై నిర్లక్ష్యం తగదు'

అనంతపురం కల్చరల్: ఎన్నికల సమయంలో వీలైనంతగా మైనార్టీలను ఉపయోగించుకుని తీరా అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం అనంత మైనార్టీలను నిర్లక్ష్యం చేస్తోందని ఐఎంఎం ఆర్గనైషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మహబూబ్ బాషా విమర్శించారు. శనివారం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మైనార్టీలకు కీలకమైన మేయర్ పదవితో పాటూ మరో 10 మందికి కార్పొరేటర్లుగా, ఒకరికి మార్కెట్ యార్డు చైర్మన్‌గా, ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా అవకాశాలు కల్పించిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఎంతో మంది మైనార్టీలు కృషి చేశారన్నారు. శ్రమించిన మైనార్టీలను ఇప్పటికైనా గుర్తించాలని డిమాండ్ చేశారు. టీడీపీ ప్రతిసారి మైనార్టీలకు అన్యాయమే చేస్తోందని మండిపడ్డారు. ఎన్నికలప్పుడు మదర్సాల వెంట, దర్గాల వద్ద దగ్గరుండి సహకారమందించిన విషయం గుర్తు పెట్టుకోవాలని కోరారు.

16న మాదిగల ఆత్మీయ సదస్సు

అనంతపురం కల్చరల్: ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా జరగనున్న మాదిగల ఆత్మీయ సదస్సును జయప్రదం చేయాలని మాదిగ ఉద్యోగుల సమాఖ్య జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్ అన్నారు. శనివారం ఎంఈఎఫ్ (మాదిగ ఉద్యోగుల సమాఖ్య) ప్రతినిధులు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లలిత కళాపరిషత్తులో ఈనెల 16న ఉదయం 10 గంటలకు పెద్ద ఎత్తున సమావేశం జరుగుతుందని తెలిపారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ విచ్చేస్తారన్నారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ నగేష్, ప్రధాన కార్యదర్శి అశోక్, దేవర పుల్లన్న, నాగేంద్ర, హనుమంతరావు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

అనంతపురం: నగరంలోని ఆరో రోడ్డులో నివాసం ఉంటున్న ఆంజనేయులు కుమారుడు హేమంత్ కుమార్ (19) శనివారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. త్రీ టౌన్ సీఐ శాంతిలాల్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన స్కూల్ బస్సులో హేమంత్ కుమార్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. దుబారా ఖర్చులు చేస్తున్నాడని తండ్రి ఆంజనేయులు కొడుకును ఫోన్‌లో మందలించాడు. దీంతో మనస్థాపానికి గురైన హేమంత్ కుమార్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు పేర్కొన్నారు.

నేత్రపర్వంగా రుక్మిణీకృష్ణుల కల్యాణం

అనంతపురం కల్చరల్: నగరంలోని శ్రీశృంగేరీ శారదా శంకర మఠంలో వారం రోజులుగా సాగిన భాగవత సప్తాహం శనివారం రాత్రి ఘనంగా ముగిసింది. ప్రముఖ ప్రవచన కర్త మల్లాది వేంకట రామనాథ శర్మ ఆధ్వర్యంలో చివరి రోజు భాగవతంలోని గజేంద్ర మోక్షంపై ప్రవచనాలు చెప్పారు. భాగవతోత్తముల విశేషాలను ఉపమాన సహితంగా వివరించి ఆకట్టుకున్నారు. పౌరాణిక సార్వభౌమ బ్రహ్మశ్రీ మల్లాది చంద్రశేఖర శాస్త్రి జయంతి సందర్భంగా నిర్వహించిన సప్తాహానికి ప్రఖ్యాత ప్రవచన కర్త మల్లాది వేంకట రామనాథ శర్మ విచ్చేయడం ఆనందంగా ఉందని నిర్వాహకుడు సత్యప్రసాద్ తెలిపారు. రుక్మిణీ కృష్ణుల కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా జరిపించారు.